క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బోథ్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల కార్మిక నిర్మూలన, విద్యాహక్కు, లైంగిక వేధింపులు, మోటార్ వెహికిల్, ఐటీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాది ఆడెపు హరీష్, ప్రిన్సిపాల్ వలిత, కానిస్టేబుల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన కొదారి శ్రీకాంత్ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా అధ్యక్షుడు, గుడిహత్నూర్ జెడ్పీటీసీ పతంగి బ్రహ్మానంద్ తన కార్యాలయంలో శ్రీకాంత్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మడవి ప్రకాష్, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, కేవల్‌సింగ్, రెండ్ల రాజు, రాకేష్, మధుకర్, నరేష్, ప్రశాంత్, శ్రీరాం, ధరంసింగ్ పాల్గొన్నారు.

బర్డ్ ఫీడర్ తొట్టీలు ఏర్పాటు

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో పక్షి ప్రేమికుడు వెంకటేష్ బర్డ్ ఫీడర్, నీటి తొట్టీలను ఏర్పాటు చేశారు. మానవ మనుగడకు కారణమైన పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జడ్జి హుస్సేన్ అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాది హరీష్, సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర అభియాన్ కార్యక్రమం పోస్టర్, డోర్ స్టిక్కర్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ శనివారం ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 11: 30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

బోథ్: మండలంలోని మర్లపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై. రాంరెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, పరీక్ష ప్యాడ్‌లు ఉచితంగా అందజేశారు. విద్యార్థులు బాగా చదివాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, లింబారావ్, విజయ్‌కుమార్, రమేష్, గంగాధర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి హిమబిందు

ఇచ్చోడ: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని నర్సపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు అన్నారు. శనివారం గుండాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఆహారంలో ఆకుకూరలు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, సిబ్బంది రేణుక, సుశీల పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన నాయకులు'

ఆదిలాబాద్‌అర్బన్: ప్రజలకు ఉచిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన నాయకులు హామీలను విస్మరించారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ ఆరోపించారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆహార భద్రత, ఉపాధి హామీ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలను ఆదుకుందని, ప్రస్తుతం కార్మికులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు సంపెర్ల అడెల్లు, ఐఎన్‌టీయూసీ యూత్ జిల్లా అధ్యక్షుడు వీరానంద్, తదితరులు పాల్గొన్నారు.



పచ్చని పచ్చిక బయలు



ద్వారకానగర్‌లోని మున్సిపల్ పార్కు



పార్కులో వాకింగ్ ట్రాక్



శివాలయం పార్కులో ఆకట్టుకుంటున్న పెయింటింగ్



ఆహ్లాదం.. ఆరోగ్యం

- ఆధునాతన వసతులతో పార్కుల అభివృద్ధి
- ఆట వస్తువులు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్, ద్వారకానగర్ కాలనీల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కులు ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. భుక్తాపూర్ కాలనీలోని పాత చేపల మార్కెట్ వద్ద రూ.30 లక్షలు, శివాలయం వద్ద రూ.20 లక్షల వ్యయంతో ఇటీవల పార్కులను సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ రకాల పూల మొక్కలు, పచ్చిక బయళ్లతో తీర్చిదిద్దిన పార్కులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ప్రత్యేక ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ప్రజలను ఆకట్టుకునేలా గోడలకు ఆకర్షణీయమైన పెయింటింగ్‌లతో ముస్తాబు చేశారు. ప్రత్యేక వాకింగ్ ట్రాక్ ఎంతోగానే ఉపయోగ పడుతోంది. సెలవు రోజుల్లో పార్కులు సందర్శకులతో సందడిగా మారుతున్నాయి.

అందరికీ ఉపయోగం



ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. చిన్నారులు, యువకులతో పాటు కాలనీవాసులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలతో పార్కులను అభివృద్ధి చేశారు. ఉదయం, సాయంత్రం సేదతీరేందుకు తోడ్పడుతున్నాయి.

– రాజేష్, యువకుడు

సమస్యల్లో కస్తూరిబా గాంధీ పాఠశాల



కింద కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థినులు

- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

నార్నూర్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థిలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయాలను ఖర్చు చేస్తోంది. అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. కనీస సౌకర్యలు కల్పించకపోవడంతో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యను ప్రారంభించిన అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. మొత్తం 254 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఇందులో 43 మంది ఇంటర్ విద్యార్థినులు ఉన్నారు. తరగతి గదిలో బ్లాక్ బోర్డు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. బెంచీలు లేక నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు సరఫరా చేయకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న బ్యాగులోనే బట్టలు, వారికి సంబంధించిన వస్తువులు దాచుకుంటున్నారు. పాఠశాలు చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కస్తూరిబా గాంధీ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే'



మాట్లాడుతున్న చిట్యాల సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో శనివారం మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని మరిచి, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులను ప్రలోభ పెట్టి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడం తప్పితే, అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూములు లేవని ఇక్కడి నాయకులు చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. మహారాష్ట్రతో పోలిస్తే తెలంగాణలోనే పెట్రోల్, డీజిల్ రేట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్ కొత్తపెల్లి, విజయ్ గన్నోజి, తోకల నరేష్, సతీష్ రెడ్డి, కాంత, నవీన్ వర్మ, సతీష్ తాటి, అశంత్, రాము గెడం ప్రశాంత్, గణేష్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న రాములు

జైనథ్: గత 18 ఏళ్లుగా పాఠశాలల్లో చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 21వేల వేతనం అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీఎం కార్మికుల పెండింగ్ వేతనాలు, ఇతర డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 8న చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో నేడు నూతనంగా నిర్మించే గోదాం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరవుతున్నట్లు సర్పంచ్ నరేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

30న అవగాహన సదస్సు

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశం మందిరంలో ఈనెల 30న శంకరన్ ఐఏఎస్ అకాడామీ సహకారంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. శనివారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బైరీ సోమేశ్, ఆత్రం కిష్టన్న, ఆడ అర్జున్, దీపక్ పాల్గొన్నారు.

5న బీసీ సంక్షేమ సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఎన్నికలను ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ప్రభాకర్ స్వామి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం నుంచి నామినేషన్‌లు స్వీకరణ ప్రారంభం కానుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సంఘ భవనంలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. సంఘ భవనంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

తాంసి: మండల కేంద్రానికి చెందిన పుట్ట పెంటన్న మేకలు రెండు రోజుల క్రితం 15 మేకలు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని శనివారం జెడ్పీటీసీ రాజు, పశువుల కాపరితో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మేకల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న పెంటన్నకు సబ్సిడీ రుణం అందించి ఆదుకోవాలని కోరారు. వారి వెంట సర్పంచ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

అన్నదానం

ఎదులాపురం: అన్నదానం మహాదానమని రెడ్‌క్రాస్ సొసైటీ, యువజన సంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌కు చెందిన మాధవరావు శుభకార్యంలో ఆహారం మిగలగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని రిమ్స్ ప్రాంగణంలో యాచకులకు, పాదాచారులకు, ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, అజీజ్, అలీ, ప్రశాంత్, వంగ రవికుమార్ పాల్గొన్నారు.

బీసీలను అణచివేస్తున్న ప్రభుత్వం

ఖానాపూర్: ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ బీసీలను అణచివేస్తూ అభివృద్ధికి దూరం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ ఆరోపించారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన ఓబీసీ మోర్చా మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంతోపాటు రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో బీసీలు, ఓబీసీలంతా ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పడాల రాజశేఖర్, టీకు ప్రకాశ్, గొంగ ప్రవీణ్, తిరుమలగిరి, పుప్పాల ఉపేందర్, కాలేరి రాజేందర్, ఎనుముల స్వామి, పిట్టల భూమన్న, పుల్లయ్య, శ్రీను, పద్మయ్య, పుప్పాల పవన్, దాసరి రాజేశ్వర్, వాల్గోట్ సాయి, జక్కుల రవి పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నార్నూర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 11, 12న ఉట్నూర్‌లో నిర్వహించే ప్రజాతంత్ర విద్యార్థి సంఘం మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వాగ్మారే సంబాజీ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల సంఖ్యను పెంచుతున్నారని కానీ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కార్యాలయంలో కుటికెల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ప్రిపరేషన్‌ను పరిశీలిస్తున్న ప్రవీణ్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మెయిన్స్ పరీక్షకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఆయా పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల ప్రిపేరేషన్‌ను, స్లిప్ టెస్టును శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉచిత శిక్షణ పొంది అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాల సాధించారని తెలిపారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్టడీ సర్కిల్ సెంటర్‌లో అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

రైతులకు అండగా ఉండాలి



నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే బాపురావు

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన చైర్మన్ రుక్మణ్ సింగ్‌ను ఎమ్మెల్యే బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, ఆత్మ చైర్మన్ సుభాష్, సర్పంచ్ సుభాష్, ఎమ్మెల్యే కుమారుడు విశ్వజిత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తలమడుగు: ప్రతీ గ్రామంలో మెరుగైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కోటి 56 లక్షలతో నిర్మించే పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో సరైన వైద్యం అందక ఎంతో మంది మృతి చెందిన ఘటనలు ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల, మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించడం జరుగుతుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, నరేందర్ రాథోడ్, ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో రమాకాంత్, సర్పంచ్ కరుణాకార్‌రెడ్డి, వసంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్ కుమార్, వెంకటేశ్, అబ్దుల్లా, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

నాగోబా దర్బార్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు నగదు అందజేస్తున్న నాగోరావు

నార్నూర్: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మండలంలోని మాన్కాపూర్ దిశ మోడల్ పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటారు. నృత్యం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని ఆకట్టుకోవడంతో శనివారం రూ. 5వేలు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగుకు బహుమతిగా అందజేసినట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకుడు కిషన్, గ్రామ పెద్దలు సీతారాం, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ధనశ్రీ

తాంసి: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ధనశ్రీ అన్నారు. శనివారం మండలంలోని తాంసి, గిరిగాం, లీమ్‌గూడ, అంబుగాం, జామిడి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. రాత్రి పూట దొంగతనాలు జరుగకుండా ప్రజలు గస్తీ తిరగాలని సూచించారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ఏబీ స్విచ్‌లు లేక ఇబ్బంది



జైనథ్: మండలంలోని బెల్లూరి గూడ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏబీ స్విచ్ (ఆన్ ఆఫ్) లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేసేందుకు అవస్థలు పడుతున్నారు. జైనథ్ సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోవాల్సి రావడంతో ఇతర గ్రామాలకు కూడా కరెంట్ ఉండడం లేదు.

సంబంధిత అధికారి: నగేష్, ఏఈ, జైనథ్,
ఫోన్: 94408 11697